తపాలా అధికారులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

షాపుల వద్ద మద్యపానం...

డ్రోన్లకు కనిపించని వైనం..!

ఆరుబయట మద్యం తాగే వారిని డ్రోన్లతో పోలీసులు వెంటాడుతున్నారు. ఎక్కడైన పొలాల వద్ద మద్యం తాగుతుంటే వారిని పరుగెత్తించి మరీ డ్రోన్లలో చిత్రీకరిస్తున్నారు. ఈ వీడియోలను బహిర్గతం కూడా చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆరుబయట మద్యంపానం చేసే వారిని వెంటాడే పోలీసులకు.. మద్యం దుకాణాల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌ల్లో సాగుతున్న మద్యంపానం కనిపించకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఇక మద్యం సేవించే వారిని విపరీతంగా తనిఖీలు చేపట్టి దాడులు చేస్తున్న ఘటనలు కూడా ఇటీవల నెలకొన్నాయి. ఇంతలా మద్యం సేవించే వారిపై ప్రతాపం చూపుతున్న ఖాకీలకు అనధికారికంగా నడుస్తున్న అమ్మకాలు... షాపుల వద్ద తాగుతున్న సిత్రాలు కనిపించడం లేదా అన్న ఆరోపణలు పెద్దఎత్తున వెల్లువెత్తున్నాయి.

- ఆరుబయల్లో వెంటాడుతున్న ఖాకీలు
- అనధికార పర్మిట్ రూమ్‌లపై మౌనం
- షాపు పరిసరాల్లోనే మద్యపానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ నెల నుంచి కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అంతకు మునుపున్న ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రయివేటుకు మద్యం అమ్మకాల బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. పెద్దఎత్తున పోటీలు పడి మద్యం వ్యాపారులు టెండర్లు దక్కించుకున్నారు. ఇందులో అత్యధికంగా అధికారపార్టీ ముఖ్య నేతలే ఉండటం గమనార్హం. మద్యం పాలసీలో నాణ్యమైన మద్యంతోపాటు అన్ని రకాల బ్రాండ్స్‌ను అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వం చెప్పింది. కొత్త మద్యం పాలసీ ప్రకారం అనంతపురం జిల్లాలో మొత్తం 136 మద్యం దుకాణాలున్నాయి. ఇందులో జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలోనే 41 ఉన్నాయి. ఇందులో అత్యధికంగా నేతలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ మద్యం దుకాణాల్లో చాలా వాటిల్లో పర్మిట్ రూములు అనధికారికంగా నడుస్తున్నాయి. నగరం నడిబొడ్డునున్న మద్యం దుకాణాల్లో ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఈ దుకాణాలను రెగ్యులర్‌గా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వ నిబంధనలున్నాయి. మరి ఈ దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారా లేదాన్నది చూడాల్సి ఉంది.

ఆరుబయట మద్యం సేవిస్తే డ్రోన్లతో తనిఖీలు

ఎక్కడైనా మద్యం ప్రియులు ఆరుబయట మద్యం సేవిస్తే డ్రోన్లతో పరిశీలించి మరీ జరిమానాలను పోలీసులు విధిస్తున్నారు. అంతేకాకుండా అను నిత్యం వాహన తనిఖీల్లోనూ మద్యం ప్రియులను తనిఖీలు చేపట్టి జరిమానాలు విధిస్తున్నారు. ఈ జరిమానాలు విధించే క్రమంలో ప్రశ్నించిన ఒక యువకుడిని ఇటీవల అనంతపురం నగరం నడిబొడ్డున టవర్‌క్లాక్ వద్ద పోలీసులు బూటుకాలితో తన్నిన ఘటన సోషియల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ రకంగా కఠినంగా వ్యవహరించడాన్ని ఒకింత సమర్థించినా, అమ్మే చోట జరిగే ఉల్లంఘనలపై మాత్రం మెతకవైఖరి ఎందుకన్న ప్రశ్నలు సామాన్యుల నుంచి ఉత్పన్నమవుతుండటం గమనార్హం. మద్యం షాపుల వద్ద యథేచ్ఛగా మద్యపానం చేస్తున్నా పోలీసులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. డ్రోన్ల ద్వారా ఆరుబయట మద్యం చేసే వారిపై చర్యలు తీసుకోవడం మంచిదే అయినా.. అదే స్థాయిలో మద్యం షాపుల వద్ద అనధికార పర్మింట్ రూమ్‌ల వద్ద మద్యపానాన్ని కూడా అదే స్థాయిలో నియంత్రించాలనే డిమాండ్ ప్రజల నుంచి విన్పిస్తోంది.

ఆధార్ సమస్యలను పరిష్కరించండి

ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలు ఎదుర్కొంటున్న ఆధార్ కార్డు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టవర్ క్లాక్ వద్ద ఉన్న ప్రధాన పోస్టాఫీసు వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ఆధార్ కార్డు తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలని చెబుతోందన్నారు. దీంతో ప్రజలు ఆప్డేషన్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని రోజులుగా ఆధార్ కార్డు అప్డేట్ కోసం సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు ప్రధాన పోస్టాఫీసు వద్దకు వస్తున్నారన్నారు. రాత్రీపగలన్న తేడా లేకుండా అక్కడే నిరీక్షిస్తున్నా వారి ఆధార్ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ప్రధాన తపాలా కార్యాలయం వద్ద రాత్రి అక్కడే నిద్రించి ఉదయమే క్యూలైన్లో నిల్చుంటున్నారని తెలిపారు. రోజుకు వంద మందికి మించి ఆప్డేషన్ ప్రక్రియ చేయడం లేదన్నారు. ఈ స్థాయిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులకు, పాలకులకు పట్టకపోవడం విచారకరం అన్నారు. ఆధార్ కార్డు అప్డేట్ కోసం బ్యాంకుల వద్ద అవకాశం ఉన్నా అక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది ప్రజల చేత వేల రూపాయలను అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. కార్డులో పేరు మార్చడానికి ఒకసారి, ఇంటి అడ్రస్ మార్చడానికి ఒకసారి రమ్మని చెప్పి ప్రజల చేత రెండు,మూడు సార్లు డబ్బులు గుంజుతున్నారని తెలిపారు. ఇదంతా ప్రభుత్వానికి తెలిసినా చలనం లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణం ఈ సమస్య పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. దీనిపై తపాలా అధికారులు మాట్లాడుతూ తమ కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేక ఆప్డేషన్ ప్రక్రియ వేగంగా జరగడం లేదన్నారు. ఆధార్ కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, నగర కమిటీ సభ్యులు రాజు, ఎన్టీఆర్ శీన, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

టెక్నాలజీలో మార్పులను అందిపుచ్చుకోవాలి

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

మేనేజ్‌మెంట్ విద్యార్థులు టెక్నాలజీలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జెఎన్‌టియులో ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలను సృష్టించే విధంగా ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం ఎంబిఎ గొప్పతనం, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయాలను వివరించారు. అనంతరం ఫ్రెషర్స్‌డేలో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి బి.చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు లక్ష్మన్న, బసయ్య, జయరామిరెడ్డి, విశ్వనాథ్, జాకీర్‌హుసేన్, శ్రీలత, శ్రవణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య

ప్రజాశక్తి-ఆత్మకూరు

మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంభన దిశగా ముందుగా సాగాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కావేరి సమైఖ్య సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూమహిళా సంఘాల సభ్యులు వ్యక్తిగత అవసరాలకే కాకుండా, ఆర్థిక స్వాలంబన దిశగా ఎదగాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఇచ్చే రుణాలతోపాటు, బ్యాంకు రుణాలను, వ్యక్తిగత అవసరాలకు కాకుండా, చిన్న తరహా పరిశ్రమ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ బాల కొండన్న, డిఆర్‌డిఎ ఏరియా కో ఆర్డినేటర్, ఎపిఎం సుభద్రమ్మ, మండల సమైక్య ఎపిఎం పద్మావతి, సీసీలు శ్రీరాములు, వెంకటనారాయణ, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు పెద్ద లక్ష్మీదేవి, సమైక్య అకౌంటెంట్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్, ఇకెవైసి వేగవంతం చేయాలి

అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి-శింగనమల

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిఎసిఎస్, రైతుల ఇకెవైసి నమోదను వేగవంతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. శనివారం మండల పరిధిలోని సోదనపల్లి, నిదనవాడ సచివాలయాలను అసిస్టెంట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటలైజేషన్‌లో భాగంగా పిఎసిఎస్‌లు రైతులకు సేవలు అందిస్తున్నాయన్నారు. ఇందుకు సంబంధించిన ఇకెవైసిని సచివాలయ సిబ్బంది వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, మండల విస్తరణ అధికారి వెంకటలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

ఎంపిహెచ్‌ఎలను విధుల్లో కొనసాగించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత 22 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న ఎంపిహెచ్ఎ (మెల్) వర్కర్లను విధుల్లో కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంహెచ్‌ఎలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగించారన్నారు. దీనిపై బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా వారందరినీ యథావిధిగా కొనసాగించాలని గత నెల 29వ తేదీన తీర్పునిచ్చిందని తెలియజేశారు. డిసెంబర్ 5వ తేదీన వర్కర్లను అధికారులు టెర్మినేట్ చేశారన్నారు. వీరందరినీ 2002 డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి మెరిట్ లిస్టు ద్వారా భర్తీ చేశారన్నారు. వీరందరినీ విధుల్లో కొనసాగించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా టెర్మినేట్ చేయడం దుర్మార్గం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు వీరందరినీ విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, యూనియన్ నాయకులు నర్సారెడ్డి, గోవర్ధన్, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

నేడు బాలోత్సవం ఆహ్వాన కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం

అనంత బాలోత్సవ 5వ పిల్లలపండుగ ఆహ్వాన కమిటీ సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని లలిత కళాపరిషత్ మినీహాల్‌లో నిర్వహిస్తున్నట్లు అనంత బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు తెలిపారు. గత బాలోత్సవాలకు సహకరించిన అందరూ ఈ సమావేశానికి హాజరై సలహాలు, సూచనలను ఇవ్వాలన్నారు.

బిటిపికి నిధులు తెస్తాం

- ఎత్తిపోతలతో సాగుకు కృష్ణా జలాలు
- ఎంపీ అంబికా, విప్ కాలవ, ఎమ్మెల్యే అమిలినేని
- రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం, గుమ్మఘట్ట

రాయదుర్గం, కళ్యాణ దుర్గం నియోజకవర్గం రైతులకు జీవనాడిగా ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు అవసరమైన నిధులను తీసుకొస్తామని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. బిటి ప్రాజెక్టు వద్ద ఆయకట్టు సాగునీటి సంఘం రైతుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. రాష్ట్ర మత్స్య అభివద్ధి సంస్థ ఏర్పాటుచేసిన 6.48 లక్షల చేప పిల్లలను రిజర్వాయర్‌లోకి వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సంఘ సమావేశంలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బిటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి రూ.968 కోట్లు మంజూరు చేయగా కొంతమేర పనులు పూర్తి అయ్యాయన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పనులను చేపట్టేందుకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. తట్టెడు మట్టి కూడా ప్రాజెక్టు నుంచి ఎత్తలేదన్నారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక రాయదుర్గం నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సందర్భంగ బిటి ప్రాజెక్టుకు కృష్ణా జలాల మళ్లింపు పథకానికి అవసరమైన నిధులు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో పథకానికి అవసరమైన నిధులు తీసుకువస్తామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల భారం వేసారన్నారు. నేడు ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలంటూ కపట నాటకం ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలో ముంచారన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు చేయడానికి ప్రభుత్వం 2000 కోట్ల రూపాయలు మంజూరు చేసి టెండర్లు పిలిచిందన్నారు. సాధ్యమైనంత త్వరగా వీటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ సీజన్లో బిటిపి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడం అదష్టం అన్నారు. సాగునీటి పంపిణీ నష్టాలపై లెక్కలు వేసి ఎంత ఆయకట్టుకు సాగునీరు ఇవ్వగలరో లెక్కలు వేసి ఆ మేరకు నీటిని సరఫరా చేయాలన్నారు. పంట చేతికి వచ్చే దశలో ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సాగునీటి సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు సుభాన్ అధికారులతో సమన్వయంగా వ్యవహరించి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అబ్దుల్ సమీర్, డి ఈ బలరాం, బ్రహ్మసముద్రం జడ్పిటిసి ప్రభావతి, సాగునీటి సంఘం అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి సుభాన్, గుమ్మగట్ట ఎంపీడీవో రామకృష్ణ, తహశీల్దార్ శ్రీనివాసులు, గుమ్మగట్ట టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, రాయదుర్గం డి.హీరేహాల్, మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంత రెడ్డి, జనసేన రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి కరేగౌడ్ర, మంజునాథ్ గౌడ్, మత్స్య పరిశ్రమ శాఖ అభివద్ధి అధికారి లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు

అనుమతులు నిల్.. మట్టి తవ్వకాలు ఫుల్..!

- రాత్రింబవళ్లు భారీగా తరలింపు
- రైల్వే కాంట్రాక్టర్ బరితెగింపు



హిటాచీతో టిప్పర్లకు లోడ్ చేస్తున్న మట్టి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

అనుమతుల్లేకుండా రైల్వే కాంట్రాక్టర్ యథేచ్ఛగా మట్టి తరలిస్తూ కొండలు, గుట్టలను కబలిస్తున్నాడు. పట్టణ శివారులోని కనేకల్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న ఇందిరమ్మ కాలనీకి అనుకుని ఉన్న కొండగుట్టలను పెకిలించేస్తున్నారు. రాయదుర్గం రైల్వే స్టేషన్ నుంచి అదనపు రైల్వేలైన్ పనులు జరుగుతున్నాయి. మట్టి సేకరించేందుకు భూమిని కొనుగోలు చేసి కాంట్రాక్టర్ మట్టిని సేకరించాల్సి ఉంటుంది. ఆరంభంలో భూ యజమానుల నుంచి గుట్టను కొనుగోలు చేసిన కాంట్రాక్టర్ క్రమంగా అనుమతులు ఉన్నాయంటూ ప్రగల్భాలు పలుకుతూ ఇతర చోట్ల ఉన్న పోరంబోకు కొండలు, గుట్టలను కరిగించేశాడు. రాయల్టీ చెల్లించకుండా మట్టి తరలిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడితోంది. ఇవేవీ తనకు పట్టనట్టుగా కొండలు, గుట్టలు పెకలించి మట్టి తరలిస్తూ ప్రకతి సంపదను దోచుకుంటున్నాడు. కొండ గుట్టలను తవ్వేసి కాంట్రాక్టర్ మట్టి తీసుకుని నేలను చదును చేస్తే తాను భూమిని ఆధీనంలోకి తీసుకుంటానని కాంట్రాక్టర్ దగ్గర లబ్ధి పొందిన ఓ వ్యక్తి పన్నాగం పన్నినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల రోజులుగా రాత్రి, పగలు యథేచ్ఛగా విడతల వారీగా సిబ్బందిని నియమించి మట్టి తరలిస్తున్నట్లు ఇందిరమ్మ కాలనీవాసులు చెబుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ మట్టి తరలింపునకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదన్నారు.

కోమటికుంట్ల చెరువుకు నీరు విడుదల

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని పుట్లూరు చెరువు నుంచి కోమటికుంట్ల చెరువుకు హెచ్చెల్సీ అధికారులు శనివారం నీరు విడుదల చేశారు. గత 20 రోజుల క్రితం సుబ్బరాయుడు సాగర్ నుంచి పుట్లూరు చెరువుకు ఎమ్మెల్యే నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి కోమటికుంట్ల చెరువుకు శనివారం నీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ ఎస్ఇ రాజశేఖర్, డిఇ చంద్రశేఖర్, ఎఇ శ్రీనివాసులు, తాడిపత్రి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షురాలు ప్రమీలమ్మ, పుట్లూరు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, శివనారాయణరెడ్డి, రామచంద్రనాయుడు, నారాయణరెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ఎటుచూసినా మురుగే..!

యల్లనూరు మండలంలో పడకేసిన పారిశుధ్యం

రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి-యల్లనూరు

నిల్వ ఉన్న మురికినీరు

మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. అపరిశుభ్రత కారణంగా ప్రజలు అనారోగ్యపాలవుతున్నారు. మురికినీటి కారణంగా దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని పాతపేట శివాలయం వద్ద కూడా రోడ్డుపై మురికినీరు పారుతోంది. దీంతో అటుగా వెళ్లేవారు ముక్కు మూసికుని వెళ్లాల్సిన పరిస్థితి. ప్రతి గ్రామంలో దగ్గు, జలుబు, విషజ్వరాలతో బాధపడుతున్నారు. అలాగే మండలంలోని చిలమకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఎటుచూసినా మురికినీరే కనిపిస్తోంది. చిలమకూరు పంచాయతీలోని కోడుమూర్తి, అచ్యుతపురం గ్రామాల్లో మురికినీరు రోడ్లపైన ప్రవహిస్తోంది. దీనికితోడు పారిశుధ్యం పడకేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే పంచాయతీలోని మంచినీటి ట్యాంకులు కనీసం 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిన పాపాన పోలేదని చెబుతున్నారు. ఇవన్నీ తెలిసినా అటు పంచాయతీ, ఇటు సచివాలయ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెల్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఐఎన్‌టిఎస్‌ఒ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' విజయభేరి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

ఐఎన్‌టిఎస్‌ఒ మొదటి రౌండ్ ఫలితాల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రెండవ రౌండ్‌కు అర్హత సాధించారు. మొదటి రౌండ్ ఫలితాల్లో రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్టమైన పాఠ్యప్రణాళిక, అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయాయ్యయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని శ్రీచైతన్య విద్యాసంస్థల నుంచి 7,455 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6,345 మంది విద్యార్థులు రెండవ లెవల్‌కు అర్హత సాధించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ప్రిన్సిపాల్స్, కోఆర్డినేటర్లు, డీన్‌లు, ఒలింపియాడ్ పరీక్షల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

రైల్వేసేవలను మెరుగుపర్చాలని వినతి

రాయదుర్గం : రాయదుర్గం రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ప్రభుత్వ సేవలను మెరుగుపరచాలని ఆర్యవైశ్య సంఘం రాయదుర్గం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్ కోరారు. ఈమేరకు శనివారం సంఘం ప్రతినిధులతో కలిసి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, విప్ కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం మీదుగా కదిరిదేవరపల్లె- తిరుపతి, చిక్కజాజురు- గుంతకల్లు నడుమ ప్రయాణించే రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా రాయదుర్గం జంక్షన్ మీదుగా ప్రయాణించే మైసూరు- వారణాసి, యశ్వంత్పూర్-టాటా నగర్, జైపూర్ యశ్వంతపూర్ రైళ్లను రాయదుర్గం స్టేషన్‌లో ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

30న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో మాట్లాడుతున్న గుంతకల్లు సిపిఎం నాయకులు

రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పట్టణ కార్యదర్శి రాందాస్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభలో బిఆర్ అంబేద్కర్‌పై అవమానకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే అమిత్‌షా బేశరత్తుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి గౌస్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మహబూబ్ బాషా, సంచార జాతుల రాష్ట్ర కార్యదర్శి వై శ్రీనివాసులు, షాషా,వెంకి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింతకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వామపక్షాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా అవమానకరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఈయనకు ప్రధాని వత్తాసు పలకడం క్షమించరానిదన్నారు. కావున అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ వెంటనే అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 30వతేదీన ఉమ్మడి వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పుట్లూరులో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో ప్రజలు భారీఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు సూరి, డి.పెద్దయ్య, డిహెచ్‌పిఎస్ అధ్యక్షులు పెద్దన్న, భాస్కర్‌రెడ్డి, నారాయణ, పెద్దయ్య, బాలరంగయ్య, జె.పెద్దయ్య, ఆదినారాయణ, ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా అవమానకరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ వెంటనే అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, జిల్లా సమితి సభ్యులు రహీం, మండల కార్యదర్శి నాగరాజు, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యవర్గ సభ్యుడు గజ్జల దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఈనెల 30న జరిగే నిరసన దీక్షలను జయప్రదం సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సిపిఎం పార్టీతోపాటు 10 వామపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు సీనప్ప, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడిగా అచ్యుత్‌ప్రసాద్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సిపిఎం జిల్లా సభ్యులుగా శెట్టూరు మండలం యాటకల్లుకు గ్రామానికి చెందిన అచ్యుత్‌ప్రసాద్ మరోసారి ఎన్నికయ్యారు. ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన సిపిఎం జిల్లా 14వ మహాసభల్లో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగానే అచ్యుత్‌ప్రసాద్ రెండవసారి జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆకుల బాబు

ప్రజాశక్తి దిన పత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ (బాబు) శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల బాబు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తూ బడుగు బలహీన వర్గాలు కార్మికులు కర్షకుల పక్షాన ప్రజాశక్తి నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ సలేహ, గోపాల్, రామకృష్ణ, ప్రదీప్, రమేష్, ఇస్మాయిల్, లోకేష్, ప్రజాశక్తి పాత్రికేయుడు షేర్‌ఖాన్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల వీడ్కోలు సభ

అనంతపురం : బదిలీపై వెళ్తున్న మాజీ సైనికుల పోలీక్లినిక్ అధికారి కల్నల్ రాజశేఖర్‌రావుకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘ ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, సిద్దన్న, నాగిరెడ్డి, బి.ఎ.హుస్సేన్, బాలస్వామి ,ప్రభాకర్ రెడ్డి మరియు క్లినిక్ సిబ్బంది మెడికల్ మౌనిక డెంటల్ డాక్టర్ రమ్య, సాయికృష్ణ, శ్రీనివాసులు, సులోచన, ఫయీమ్, నాగరాజు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి చేయూత

తాడిపత్రి రూరల్ : బొలెరో డ్రైవర్‌గా పనిచేస్తూ మృతిచెందిన డ్రైవర్ కుటుంబానికి తోటి డ్రైవర్లు శనివారం చేయూతనందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహ మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి డ్రైవర్లందరూ అనంతపురం ఓం నమశ్శివాయ గ్రూప్ సభ్యులతో కలిసి నరసింహ కుటుంబానికి శనివారం రూ.60వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బాలకృష్ణ, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారులకు బెల్లం విక్రయించొద్దు..

గుంతకల్లు : గ్రామీణ ప్రాంతాల్లో సారా తయారీదారులకు బెల్లం విక్రయించరాదని ఎక్సైజ్ సీఐ శివసాగర్ సూచించారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని బెల్లం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సారాయి తయారు చేయడంపై నిషేధం విధించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలు, తండా గ్రామాల్లో యథేచ్ఛగా సారా తయారు చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. సారా తయారీకి అవసరమైన ముడిసరుకు బెల్లం ఎవరికీ విక్రయించరాదని సూచించారు. ఈ సమావేశంలో పట్టణంలోని బెల్లం వ్యాపారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్థలాన్ని కాపాడాలని వినతి

యల్లనూరు : మండలంలోని దుగ్గుపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరారు. ఈమేరకు తహశీల్దార్ రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గ్రామకంఠం భూమిలో అంగన్వాడీ కేంద్రానికి స్థలం కేటాయించారన్నారు. అయితే ప్రస్తుతం ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తులు కబ్జా చేస్తున్నారన్నారు. వెంటనే స్పందించి అంగన్వాడీ కేంద్రానికి చెందిన భూమిని కాపాడాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ పంచాయతీ కల్లుదేవనహళ్లి గ్రామంలో నివాసం ఉంటున్న బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు సోమనాథ్‌గౌడ్ శనివారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో కల్లుదేవనహళ్లికి చెందిన దుద్దేకుంట కృష్ణకు చెందిన కొట్టం పూర్తిగా కాలిపోయింది. దీంతో బాధితుడు సర్వం కోల్పోయాడు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు సోమనాథ్‌గౌడ్ ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వన్నూరుస్వామి, బంగి లోకేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో షెడ్యూల్ కులాల జాబితా ప్రదర్శన

నార్పల : మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో షెడ్యూల్ కులాలకు చెందిన జాబితాను ప్రదర్శించినట్లు ఎంపిడిఓ గంగావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31వతేదీలోపు పంచాయతీ కార్యదర్శికి గానీ, రెవెన్యూ అధికారికిగానీ తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత సరిజేసి జనవరి 6న ఆన్‌లైన్‌లో తుది జాబితాను పొందుపరచనున్నట్లు తెలిపారు.

ట్రేడ్ యూనియన్‌ను బలోపేతం చేయండి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్‌ను బలోపేతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. నూతనంగా నియమితులైన వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి శనివారం నగరంలోని స్వగృహంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ జెండాలోనే కార్మికవర్గం కలిగి ఉందన్నారు. కూటమి పాలనలో అన్నివర్గాల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వైసిపి తరపున ఆయా వర్గాలకు బాసటగా నిలవాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, నరసింహులు, నాయకులు చింతకుంట మధు, నాగార్జునరెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, చిరంజీవి, బెస్త తిరుపాలు, మహేష్, సతీష్, దివాంజీ, నాగేంద్ర, సాకే మురళీ, రామంజినేయులు, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

5న ప్రజ్ఞా వికాస పరీక్ష

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో వచ్చేనెల 5వతేదీన భారత విద్యార్థి ఫెడరేషన్, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాసం పరీక్ష నిర్వహించనుట్లు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంఘాల నాయకులు తెలిపారు. శనివారం ఉరవకొండలోని హైస్కూల్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు, యుటిఎఫ్ సహ కార్యదర్శి రామప్పచౌదరి మాట్లాడుతూ ప్రధాన పరీక్షల్లో పదో తరగతి పరీక్షలు కీలకం అన్నారు. ఎంతటి మేధావులైన ఉత్తీర్ణత చదువుల కోసం టెన్త్ పరీక్షల నుంచే ప్రారంభమవుతారన్నారు. అలాంటి పరీక్షను సమర్థవంతంగా రాసేందుకే పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పరీక్ష రాసే విద్యార్థులు ఫోన్ 81796 41653, 63052 00875 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాజశేఖర్, రఘు, రాజశేఖర్, శ్రీనివాసగుప్తా, బండయ్య, ఇస్లాం బాసా, ఎస్ఎఫ్ఐ నాయకులు చిరంజీవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

పామిడి : చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందనిటిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు , జిల్లా నాయకులు బత్తుల కోదండరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి జనవరిలో సంక్రాంతి కానుకగా డిఎ ప్రకటించనున్నట్లు తెలిపారు. అలాగే ఉగాదిలోపుగా 12వ పిఆర్‌సి అమలు ఆలస్యమైతే ఉద్యోగ సంఘాల నాయకులతో సమిష్టి సమావేశం జరిపిన అనంతరం మధ్యంతర భృతి కూడా ప్రకటించే అవకాశం ఉందన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించండి

మండల సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని పలువురు సర్పంచులు కోరారు. శనివారం అనంతపురం రూరల్ మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.వరలక్ష్మీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం రూరల్ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేసినా ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే పంటలు సాగు చేసి రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ఎఒ శశికళ కోరారు. కొడిమి జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని జెడ్పీటీసీ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. వీటితోపాటు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, ఎంఇఒ వెంకటస్వామి, విద్యుత్ శాఖ ఎఇ సోమశేఖర్, పశుసంవర్ధక, ఎపిఎస్ ఆర్‌టిసి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు ఆసుపత్రి ఎఒపై విచారణ

ప్రజాశక్తి-గుంతకల్లు

విచారణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న రామ్‌ప్రసాద్‌పై ఆర్ఎంఒ అధికారి శనివారం విచారణ చేపట్టారు. మహిళా పారిశుధ్య కార్మికులు, వైద్యులపై ఎఒ వేధింపులకు పాల్పడటమే కాకుండా అవినీతిపై ఇటీవల పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఇందుకు స్పందించిన జిల్లాస్థాయి ఉన్నతాధికారులు సత్యసాయి జిల్లా మడకశిర ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ టిఎస్ దివాకర్ బృందాన్ని విచారణకు ఆదేశించారు. దీంతో దివాకర్ బృందం శనివారం ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రరావు సమక్షంలో విచారణ చేపట్టింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఎఒ రామ్‌ప్రసాద్‌పై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. వాటిపై సమగ్రంగా నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

ఎఒపై ఫిర్యాదుల వెల్లువ

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పరిపాలనాధికారి (ఎఒ) రామ్‌ప్రసాద్ అవినీతి, వేధింపులపై సిఐటియు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, దళిత సంఘాల నాయకులు ఆర్ఎంఒ డాక్టర్ దివాకర్‌కు విడివిడిగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు మారుతీప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సురేష్, దళితసంఘాల నాయకులు ఎం.మహేంద్ర, జింకల జగన్నాథ్, భీమలింగ, స్వామిదాస్, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ఉపాధ్యాయ భవనంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నూతన డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా పని చేస్తున్న యుటిఎఫ్ రాబోయే సంవత్సరానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడానికి సమగ్ర సమాచారంతో క్యాలెండర్, డైరీని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, నాయకులు శ్రీనివాసులు, వెంకటనాయుడు, ఆదిశేషయ్య, కొండప్ప, రమేష్, విరూపాక్షి, నాగేంద్ర, వీరేశ్వరాచారి, పవన్‌కుమార్, మహమ్మద్‌గౌస్, గంగాధర్, సంజీవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు

రాయదుర్గం-భూపసముద్రం మార్గంలో ఏర్పాటు చేసిన రెండు వరుసల బిటి రోడ్డు పనులను విజయవాడ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి సమీపం వరకూ దాదాపు రూ.13 కోట్లతో 7.1 కిలోమీటర్ల మేర రెండు వరుసల బిటి రోడ్డు పనులకుగాను 5.5 కిలోమీటర్ల మేర పని పూర్తయింది. దీంతో రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలించింది. ఇందులో భాగంగా శాంపిల్స్ సేకరించారు. అలాగే రాయదుర్గం చెక్‌పోస్టు నుంచి గొల్లపల్లి గ్రామం వరకూ వెట్ మిక్స్ మెటలింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బి ఇన్‌ఛార్జి ఎస్ఇ రాజగోపాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌రెడ్డి, డిఇఇ రవిశంకర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డిఇ శ్రీనివాసులు, క్వాలిటీ కంట్రోల్ జెఇ అజయ్, ఆర్అండ్‌బి జెఇ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నార్పల ఆసుపత్రిలో సమావేశ మందిరం ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల

సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న శివకృష్ణచౌదరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు నిర్మించిన సమావేశ మందిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శివకృష్ణచౌదరి మాట్లాడుతూ యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా త్వరలోనే నార్పలలో ట్రస్టు కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం శివకృష్ణచౌదరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు ప్రవీణ్ కుమార్, సాదియా, ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, రంగాపురం సర్పంచి కుళ్లాయప్ప, బలిజ సంఘం అధ్యక్షులు ఇండ్ల రంగనాథ్, మాజీ ఎంపిటిసి ఆకుల లోకనాథ్, పోస్టు పుల్లారెడ్డి, యంగ్ ఇండియా నాగభూషణ, గూగూడు లక్ష్మీరెడ్డి, నరసాపురం శ్రీరామ్‌చౌదరి, చామలూరు శ్రీనివాసులు, బండ్లపల్లి శేషానందరెడ్డి, పసుపులేటి లక్ష్మీనారాయణ, పప్పూరు శ్రీనివాసులు, గొల్లపల్లి పోతులయ్య, గూగూడు నరసింహుడు, సిద్ధరాచర్ల నాగభూషణ, కొట్టాల సతీష్, జగదీష్ చౌదరి, ఇండ్ల రాము, శివప్రసాద్, బుడెన్ ఖాన్, వైద్య సిబ్బంది బాలాజీ, అక్కులప్ప, ప్రమీల, రాజేంద్ర, అరుణ, ఎర్రి స్వామి, రామలింగ, అక్షిత, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలిసిన సిఇఒ

అనంతపురం రూరల్ : నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను నూతనంగా నియమితులైన ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.రామచంద్రారెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉపముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు శనివారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నరసింహారెడ్డి, సర్పంచి వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మళ్లీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకోవడంతో నెలరోజులుగా మీరు విధుల్లో నిమగ్నమయ్యారన్నారు. ఈనేపథ్యంలో ఉచితంగా యూనిఫాం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, బిల్ కలెక్టర్ జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు పరిధిలోనే పీజీ సెట్, రీసెట్ నిర్వహించాలి

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ పరిధిలోనే పీజీసెట్, రీసెట్ పరీక్షలు నిర్వహించాలని ఎపి స్టూడెంట్స్ జెఎసి నాయకులు కోరారు. ఈమేరకు శనివారం ఎస్‌కెయులో వర్శిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి, జిల్లా అధ్యక్షులు అమర్‌యాదవ్, జిల్లా నేతలు మధుసూదన్, రాజేష్, విజయ్, జయపాల్, గోవర్ధన్, పార్థసారథి, లతీఫ్, పవన్ పాల్గొన్నారు.

బిసి భవన్ ఏర్పాటు చేయాలని వినతి

అనంతపురం రూరల్ : నగరంలో బిసి భవన్ ఏర్పాటు చేయాలని బిసి రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే నరేష్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు బిసి భవన్ లేకపోవడం బాధాకరమన్నారు. కావున వెంటనే ప్రభుత్వం చర్చించి బిసి భవన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ బిసి భవన్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నామని, త్వరలోనే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, బిసి నాయకుడు డికె.రామలింగ, శ్రీనివాసులు, మనోజ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వానికి విరాళం

అనంతపురం రూరల్ : సభ్యత్వాల నమోదు కోసం 28వ డివిజన్ అశోక్‌నగర్‌కు చెందిన టిడిపి నాయకులు నారాయణమ్మ, టిడిపి నాయకుడు గురు కలిసి రూ.50వేలు విరాళం అందజేశారు. ఈమేరకు శనివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమ్మ, గురును ఎమ్మెల్యే అభినందించారు.

విభిన్నం సిపిఎం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్ని రాజకీయ పార్టీల్లోల్లాగా పై నుంచి ఆదేశించడం వాటిని పాటించడం కాకుండా సమిష్టి నిర్ణయం మేరకు అమలు చేయడమన్నది సిపిఎం విధానం. అనంతపురం నగరంలో గత సోమ,మంగళవారం జరిగిన 14వ జిల్లా మహాసభను పరిశీలించినా ఇదే స్పష్టంగా కనిపిస్తుంది. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా చర్చించడం, నిర్ణయాలు చేయడం వాటిని అమలు చేయడం ఆ పార్టీలో కన్పించింది. రెండు రోజుల మహాసభ జరిగిన తీరు కూడా దీనిని స్పష్టం చేస్తుంది. మొదటి రోజు బహిరంగ సభ ఎంతో క్రమశిక్షణతో జరిగింది. వందలాది మంది కార్యకర్తలు జిల్లా నలుమూలల నుంచి విచ్చేశారు. అందరూ ఎర్రజెండాలను చేతబట్టుకుని ఉత్సాహంతో ఉరకలేశారు. అనంతరం జరిగిన సభలోనూ నాయకులు చేసిన ప్రసంగాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డిలు చేసిన ప్రసంగాలు ఎంతో అర్థవంతంగా సాగాయి. దేశంలో మతోన్మాద బిజెపి అనుసరిస్తున్న విధానాలను, రాష్ట్రంలో ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలు, సంక్షేమ కోతలపై వివరించారు. అనంతరం రెండు రోజులపాటు నగరంలోని ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభలో మూడు సంవత్సరాల కాలంలో సిపిఎం చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించుకున్నారు వీటి ఫలితంగా వచ్చిన విజయాలతోపాటు, లోటుపాట్లపై నిర్దిష్టంగా చర్చించారు. పార్టీ బలాలు, బలహీనతలపైనా చర్చలు జరిగాయి. రాబోయే మూడు సంవత్సరాల కాలంలో వీటిని ఏ రకంగా అధికమించాలన్న దానిపై ప్రణాళికను రూపొందించారు. అన్నింటికంటే నూతన కార్యవర్గం ఎన్నిక ఎంతో ప్రజాస్వామ్యయుతంగా జరగడం గమనార్హం. ఎవరో చెప్పిన వారిని కాకుండా ఎన్నిక రూపంలో ప్రతినిధులు ఎన్నుకోవడం అంతర్గత ప్రజాస్వామ్యానికి నిలువుటద్దంగా నిలిచింది. మొత్తంగా రెండు రోజుల మహాసభలు ఎంతో ప్రజస్వామ్యయుతంగా సాగడమే కాకుండా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపైనా చర్చించారు. వ్యవసాయ జిల్లాగానున్న ఇక్కడ ఆ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారనికి ఏ రకమైన పోరాటాలను రూపొందించాలని చర్చించారు. వెనుకబడిన ఈ ప్రాంతాభివృద్ధికి అత్యంత కీలకమైనది సాగునీటి సాధన. దీనికి ఏ రకమైన పోరాటాలు చేపట్టి ప్రభుత్వాలను దారిలో పెట్టాలన్న అంశాలను నిశితంగా చర్చించారు. ఈ చర్చల సారాంశాన్ని క్రోడికరించి ఉద్యమకార్యాచరణను రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టాలని నిర్ణయించారు. వీటి అమలుపై రాబోయే రోజుల్లో పోరాటాలను రూపొందించే విధంగా జిల్లా కమిటీ కూర్పు సాగింది. మొత్తంగా రెండు రోజుల పాటు సాగిన మహాసభ ఇతర పార్టీలకు సిపిఎంకు మధ్యనున్న వైవిధ్యం ఏమిటన్నది స్పష్టం చేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

రథం తయారీకి విరాళం

విరాళం అందజేస్తున్న దృశ్యం

కుందుర్పి : బొమ్మిలికుంట ఆంజనేయస్వామి రథానికి కుందుర్పి గ్రామానికి చెందిన బోరు ఏజెంట్ లక్ష్మణమూర్తి కుటుంబ సభ్యులు శనివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులకు శనివారం సంబంధిత చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అతావుల్లా, జైచంద్ర, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, ఫక్రుద్దీన్, పట్టణ అధ్యక్షులు బోయ నాగరాజు, శెట్టూరు అధ్యక్షులు మల్లయ్య, మైనారిటీ నాయకులు దాదాపీర్, టౌన్ ఉపాధ్యక్షులు మాల ఈశ్వర్‌ప్రసాద్, బొచ్చుపల్లి హనుమంతురాయుడు, చాపరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు,నగదు అపహరణ

గుత్తి : పట్టనంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికురాలు భూమికకు చెందిన జత బంగారు కమ్మలు, రూ.9వేల నగదును శనివారం సాయంత్రం గుర్తుతెలియని దుండగులు అపహరించారు. పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన భూమిక గుంతకల్లుకు వెళ్తుండగా గుత్తి బస్టాండ్‌లో బ్యాగులో ఉన్న బంగారు, నగదును దొంగలు దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కె.సురేష్, కానిస్టేబుల్ భాస్కర్‌నాయుడు బస్టాండ్‌కు వెళ్లి విచారణ చేపట్టారు.

వంద రోజుల ప్రణాళికను సవరించాలి

అనంతపురం : ఎస్ఎస్‌సి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం తప్పనిసరిగా సవరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. యాడికి, గుంతకల్లు మండలాల్లో ఎస్‌టియు సభ్యత్వ స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌సి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సవరించకపోతే ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన, ఇబ్బందులకు గురవుతారన్నారు. సిలబస్ పూర్తి కాకుండానే పిల్లలకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను బలవంతంగా అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం మంచిది కాదన్నారు. కావున ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.ప్రసాద్, సీనియర్ నాయకులు కేశవనాయుడు, జిల్లా కౌన్సిలర్ రమణయ్య, జిల్లా కార్యదర్శి జి.మల్లికార్జున, మండల నాయకులు హరినాథ్, రామాంజనేయులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి డ్రామాలను ప్రజలు నమ్మరు

అనంతపురం : గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అరాచక పాలనను కొనసాగించిన వైసిపి నాయకుల మాటలు, డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని జగన్ విద్యుత్ ఛార్జీల పెంపుపై ధర్నాలు చేయిస్తున్నారన్నారు. ఆయన హయాంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు ఆదేశాలు ఇచ్చి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు మోపడం బాధాకరమన్నారు. జగన్ అవినీతి ధనదాహం వల్లే ప్రజలపై విద్యుత్ భారాలు పడుతున్నాయన్నారు. ఈ విషయం తెలుసుకుని వైసిపి నాయకులు ముందు జగన్ ఇంటి ముందు ధర్నా చేయాలని సూచించారు.

రచయిత 'ఆకుల'కు సన్మానం

నార్పల : ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కాకరపర్తి భావనారాయణ (కెబిఎన్) కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ప్రతినిధుల కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన ఆకుల రఘురామయ్యను ఘనంగా సన్మానించారు. విజయవాడలోని కెబిఎన్ కళాశాల ఆడిటోరియంలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కవి సమ్మేళనంలో 'కడుపుబ్బా నవ్వుకో' అనే శీర్షికతో కవితా గానం చేసిన ఆకుల రఘురామయ్యను తమిళనాడు రాష్ట్రం హోసూరు లోకసభ సభ్యులు కె.గోపీనాథ్ ఘనంగా సత్కరించడంతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, మెడల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాల తెలుగు భాషా అభిమానులు, సాహితీవేత్తలు కవులు, కళాకారులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లతో సమీక్ష

అనంతపురం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి అనుపమ జేమ్స్ అధ్యక్షతన శనివారం జిల్లాలోని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లకు నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిబ్బంది గంగాధర్‌రెడ్డి, శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెచ్ఇఒ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

రాయదుర్గం : రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. శనివారం తన నివాసంలో పార్టీ గుమ్మగట్ట మండల నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవా ఆశ్రమంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు శ్రీనివాసులు, సతీమణి ధనలక్ష్మి కుమారుడు గోకుల్ పుట్టినరోజు సందర్భంగా దుస్తుల పంపిణీకి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సత్యాత్మానంద స్వామి, కవీన్‌ఆదిత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

రెవెన్యూ సదస్సుల్లో అధికారులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. శనివారం మండలంలోని గోనేహాళ్ గ్రామంలో తహశీల్దార్ మునివేలు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వ చేపట్టిన రీసర్వే కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతోపాటు ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఉన్నాయన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికే సిఎం చంద్రబాబు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారన్నారు. సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జగన్నాథ్‌రెడ్డి, తుంగభద్ర జలాశయం సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, టిడిపి కన్వీనర్ బలరామిరెడ్డి, ఎంపిడిఒ దాస్‌నాయక్, ఇఒఆర్‌డి దేవదాస్, మండల విద్యాధికారి మల్లికార్జున, ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఒ సుజాత నరసింహమూర్తి అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని తలుపూరు సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. కావున రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌బాబు, పంచాయతీ సర్పంచ, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువులో గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 12మంది వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, సర్వేయర్ సుంకన్న, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాల్ మండలం గోనేహాల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

బెలుగుప్ప : మండల పరిధిలోని కోనంపల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ చంద్రశేఖర్, సర్వేయర్ సందీప్, నాయకులు గోవిందరాజులు, వెంకటేశులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండలంలోని తొండపాడు, జక్కలచెరువు గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులకు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఓబులేసు, రీసర్వే ఉప తహసీల్దార్ శ్రీలత, తొండపాడు ఆలయ ఈఓ కురుబ నాగేంద్రుడు,హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ, సర్వేయర్ సాయి, వీఆర్వోలు టి.సురేంద్ర,వెంకటరాముడు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని వినతి

నార్పల : మండల కేంద్రంలోని ఆకుల జయసింహ కళాకారుల కాలనీ, ఇందిరమ్మ కాలనీ, సిపిఐ కాలనీలకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎఇ సంతోష్‌కుమార్, ఎడిఇ రఘును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీల్లో విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యుత్ లేక రాత్రిళ్లు భయాందోళన చెందుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో వెంటనే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. విన్నవించిన వారిలో గాండ్లసంఘం అధ్యక్షులు గాండ్ల రాము, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ సాలేహా, తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని చిన్న ముష్టూరులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఏపిఎస్ఎస్‌డిసి, ఎస్ఇఇడిఎపి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాల్లో డాక్టర్స్ రెడ్డీస్ గ్రూప్స్, క్రెడిట్ అక్సిస్ గ్రామీన్ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. జాబ్‌మేళాలో 60 మంది పాల్గొనగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశ్రఫ్‌అలీ, జనరల్ హెచ్ఒడి వి.నరసింహారెడ్డి, కళాశాల ప్రాంగణ నియామక అధికారి హుస్సేన్, ఏపిఎస్ఎస్‌డిసి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్, కోఆర్డినేటర్ జయలక్ష్మి, జిపిటి ఇన్‌ఛార్జి అనిల్, ఎస్ఇఇటి ఎపి కోఆర్డినేటర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎండోస్కోపీ సర్జరీలపై శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎండోస్కోపీ, లాప్రోస్కోప్ సర్జరీలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు, శిక్షణ పర్యవేక్షకులు ఆత్మరాం, వైస్ ప్రిన్సిపాల్ తెలుగు మధు, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

ప్రజాశక్తి-శింగనమల

స్మార్ట్ ఆశీర్వాద్ ప్రాజెక్టులో భాగంగా అయోడిన్ లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని లోలూరు, ఆకులేడు, మదిరేపల్లి గ్రామాల్లో కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సూక్ష్మ పోషకాలు, శాఖాపరమైన ఆహార పదార్థాలపై కళాజాతా బృందం పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐజిటి జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య, స్టాఫ్ సుదర్శన్‌రెడ్డి, మహమ్మద్ రఫీనా, పోతులయ్య, రమణమ్మ, జాతా బృందం సభ్యులు తరిమెల రాజు, తిప్పయ్య స్వామి, బాలు, నిర్మల, సరోజ, ఎంఎల్‌హెచ్‌పిలు మౌనిక, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

గాలివీడు ఎంపిడిఒపై దాడికి నిరసన

ప్రజాశక్తి-నార్పల

ఉమ్మడి కడప జిల్లా గాలివీడు మండల ఎంపిడిఒ జవహర్ బాబుపై దాడికి నిరసనగా శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గంగావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఎంపిడిఒపై దాడికి పాల్పడిన వైసిపి నేత సుదర్శన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నూర్ మొహమ్మద్, రవీంద్రనాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ఎపిఒ ఎర్రమ్మ, మోహన్, సురేష్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడికి నిరసనగా శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గాలివీడు ఎంపిడిఒపై వైసిపి నేత దాడి చేయడం బాధాకరమన్నారు. వెంటనే వైసిపి నాయకుడిని కఠినంగా శిక్షించి ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జెఇ నరేంద్ర, డిజిటల్ ఇంజినీర్ నాగేష్, టైపిస్ట్ విజయ్, జూనియర్ అసిస్టెంట్ మాధవి, సిఒ రవి, పంచాయతీ కార్యదర్శులు, అటెండర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై వైసిపి నాయకులు దాడి చేయడాన్ని రాయదుర్గం ఎంపిడిఒ కొండన్న ఖండించారు. ఈమేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది కలిసి నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, సిబ్బంది కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో..

జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే నైతిక అర్హత మాధవ్‌కు లేదన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు పాపం ముమ్మాటికీ వైసిపిదే అన్నారు. రెండేళ్ల క్రితమే విద్యుత్ ఛార్జీలు పెంచే విధంగా అప్పటి సిఎం జగన్ ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వైసిపిని ఏనాడో ప్రజలు మరిచిపోయారని, ఇక గోరంట్ల మాధవ్‌ను పట్టించుకునే పరిస్థితుల్లో ఎవరూ లేరన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే చిత్తశుద్ధి కలిగిన నేత పవన్‌కళ్యాణ్ అన్నారు. కావున ఇంకోసారి పవన్ కళ్యాణ్‌ని విమర్శిస్తే జన సైనికుల ప్రతిఘటన తప్పదన్నారు.

కలిసికట్టుగా మండలాన్ని అభివృద్ధి చేద్దాం

పామిడి : కూటమి నాయకులందరం కలిసి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూర్ ఈశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో కూటమి సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి వర్గ విభేదాలు ఉండకూడదన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి టిడిపి సభ్యత్వ నమోదును విజయవంతంగా ముగించాలన్నారు. అనంతరం కేక్ కోసం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. తర్వాత సచివాలయం, విలేజ్ క్లినిక్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల టిడిపి జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.